క్లుప్తంగా

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీఈఓ పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలించాలని కోరారు.

సర్వే పనులు ప్రారంభం



లింగాల: మండలంలోని నూతనంగా నిర్మించనున్న రాంపూర్ కెనాల్ నిర్మాణం కోసం సర్వే బృందాలు మంగళవారం సర్వే పనులు ప్రారంభించాయి. మండలంలోని బాకారం, రాంపూర్, వల్లభాపూర్, మానాజీపేట గ్రామాలను కలుపుతూ మొత్తం ఐదున్నర కిలోమీటర్ల పొడవులో కాల్వలను నిర్మించనున్నారు. కార్యక్రమంలో లింగాల, ఉప్పునుంతల మండలాల సర్వేయర్లు రాంబాబు, షఫిల్లాద్దీన్, ఏఈఈ ధీరజ్, ఏఆర్‌ఐ అనిల్, రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాజిపేట: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని..దుమ్ము, ధూళీ, రాళ్లు లేకుండా ధాన్యం తీసుకురావాలని ఏపీఎం శ్రీహరి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మరికల్ సమీపంలో మంగళవారం కల్లాల్లో వరి ధాన్యాన్ని ఏఈఓ, ఐకేపీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరి ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ. 2320, సాధారణ రకం రూ.2300, వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్వీస్ రిజిస్టర్ల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలో వివిధ పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించిన నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లను పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు మంగళవారం అందజేశారు. సొంత ఖర్చులతో సర్వీస్ రూల్స్ పుస్తకాలు అందజేయడంపై నూతన ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలసూరు సురేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, బిచ్చానాయక్, ప్రవీణ్‌రెడ్డి, పరమేశ్, నిరంజన్, కృష్ణ, సాయిప్రకాశ్‌రెడ్డి, బాబురావు, పాండు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి

కల్వకుర్తిరూరల్: విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘానికి రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి మంగళవారం కల్వకుర్తి పాడి రైతులు వినతిపత్రం అందజేశారు. పదిహేను రోజులకు ఒక్కసారి బిల్లులు రావాల్సి ఉండగా 60 రోజులు అవుతున్న బిల్లులు రాలేదని తెలిపారు. బిల్లులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. శేఖర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

తిమ్మాజిపేట: ఎన్‌ఆర్‌ఐ నాగోల్ మురళీధర్ రెడ్డి సొంత ఖర్చులతో అన్ని వర్గాల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించేందుకు ముందుకు వచ్చారని రిటైర్డ్ ప్రిన్సిపాల్ తూడి హనుమంతురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన స్వగ్రామం బిజినపల్లి మండలం వెలుగొండలో డిసెంబరు 8 నుంచి 18 వరకు ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కోడేరు: బైక్ అదుపు తప్పి ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన కోడేరులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు.. బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి మన్నెం అతని బావ బక్కయ్యను పొలంలో దించి బక్కయ్య కూతురు రాధను ఎక్కించుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడింది. ప్రమాదంలో మన్నెంకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చారకొండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని తిమ్మాయిపల్లిలో జడ్చర్ల- కోదాడ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. వంగూరుకు చెందిన బాషమోని అంజయ్య, మల్లేష్ టీవీఎస్‌పై సారగట్ల మైసమ్మ దేవాలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో తిమ్మాయిపల్లిలో ప్రధాన రహదారిపై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీ లైట్ ఫోకస్ వల్ల ధాన్యం కుప్పను తగిలి కిందపడ్డారు. ప్రమాదంలో అంజయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు.

సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... ఆర్టీసీలో తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్టీసీలో ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి మద్దిలేటి మాట్లాడారు. 2019 సంవత్సరం నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై కొనసాగుతున్న ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మధుసూధన్, అంబయ్య, వెంకటేశ్వర్లు, రామయ్య, శ్రీను, నాగరాజు, అంజిగౌడ్, బాలకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో..

నాగర్‌కర్నూల్ రూరల్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సామాజిక భద్రత పథకాలైన పీఎఫ్, ఎస్‌ఆర్‌బీఎస్, ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్ట్‌లకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను నియమించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, అశోక్, మధు, సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటస్వామి, బాలయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తంలో మంత్రి సూచనలు

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్ రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. శాస్త్రవేతలు మాట్లాడుతూ.. వరిపంటలోని వరి కొయ్యలు దహనం చేయవద్దన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శోభారాణి, ఏఈఓలు సురేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: రైతు నేస్తం కార్యక్రమం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుందని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు రైతులకు పంటలకు సంబంధించిన అన్ని రకాల సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సాయిరాం, నాజ్మీన్, అబ్దుల్లా, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

తెలకపల్లి: ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రార్థనా సమయాని కంటే ముందే పాఠశాలకు విధిగా హాజరుకావాలన్నారు. నాణ్యమైన విద్యాబోధన విద్యార్థులకు అందించాలన్నారు. నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రతి పాఠశాలల్లో నీటి సమస్య ఉందని వాటిని పరిష్కరించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత ఏఈ మల్లేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిని నియమించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల సంక్షేమ శాఖ నుంచి ప్రతి మండలానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్యాధికారి రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కుర్మయ్య, బాలీశ్వర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 3న జరిగే దివ్యాంగుల దినోత్సవాన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

25న లక్ష దీపోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో ఈ నెల 24, 25వ తేదీల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుబ్బరామయ్యశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. 25న లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

వెల్దండ: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొట్రతో పాటు ఆయా గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ముందు రోజే సర్వే చేయాల్సిన ఇళ్లను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం సర్వే పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, కార్యదర్శి భాస్కర్, టీఏ సత్యనారాయణ, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కొట్రలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సమగ్ర సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. ఎంపీడీఓ బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ప్రత్యేకాధికారులు పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలతో పాటు సర్వే విధానంపై అవగాహన కల్పించారు. మండలంలో 30 శాతం సర్వే పూర్తైనట్లు ఎంపీడీవో తెలిపారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం



తాడూరులో కార్మికులను సన్మానిస్తున్న సిబ్బంది

తాడూరు: మండల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

టాయిలెట్ డే కార్యక్రమాలపై అవగాహన..

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రపంచ టాయిలెట్ డే కార్యక్రమాలపై ఎంపీడీవో కోటేశ్వర్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్తగా మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలన్నారు. ఎస్‌బీఎం కింద టాయిలెట్ వాడకం, ఆవశ్యకత గురించి అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం నుంచి డిసెంబర్ 10వ తేది వరకు రోజువారిగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

వెల్దండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆదర్శ మోడల్ స్కూల్ క్లాస్‌మేట్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు చరణ్, అభిలాష్, అజయ్ మొదటి స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో కస్తూర్బ గాంధీ పాఠశాలకు చెందిన అశ్విని, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలకు చెందిన కీర్తి, భార్గవి రన్నింగ్‌లో ప్రతిభ కనబరిచినారు. అదే విధంగా జూనియర్ విభాగంలో బాలురు ఈశ్వర్, గణేష్, చరణ్, బాలికల విభాగంలో మౌనిక, నందిని, సింధులు గెలుపొందారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రాఘవేందర్, పీజీటీ మల్లేష్, పీఈటీ రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దాతల సహకారంతో నిత్యాన్నదానం



విరాళం అందజేస్తున్న అనిత

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారం ఉమామహేశ్వర క్షేత్రంలో నిత్యాన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరం నర్సయ్యగౌడ్ సతీమణి అనిత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిత్యాన్నదానానికి రూ. 25వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ తరుపున చైర్మన్ మాధవరెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ప్రేమ్‌రాజు రూ. 11వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



తెలకపల్లిలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం భారత దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మోతిలాల్‌నాయక్, మట్ట వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యా నిలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి టీపీసీసీ సభ్యుడు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూధన్ రావు, వెంకటస్వామి, జమీల్ అహ్మద్‌ఖాన్, వసంతకుమార్, జుబేర్‌ఖాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హరినారాయణగౌడ్, రుపతయ్యగౌడ్, రఘురామాచారి, కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శంకర్‌రాథోడ్, పూజారీ వెంకటయ్య, ఇందిరమ్మ, విజయలక్ష్మి, నందిని తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో బుచ్చయ్య, హన్మంత్‌రెడ్డి, రహీం, శ్రీనివాసులు, రాజారాం, జాకీర్, కృష్ణయ్య, రెహమాన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద మంగళవారం జయంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మామిళ్లపల్లి యాదయ్య, చోటు మియా, మామిళ్లపల్లి శారద, ఎండీ ఫరీద్, బాలస్వామి, నర్సింహ, బాలగౌడ్, కొమ్ము ఆనంద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కందనూలు: కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీతారామస్వామి దేవాలయంలో రామలింగేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, ఆరుద్రోత్సవం, భక్తులచే సామూహికంగా అన్నాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ ఆధ్వర్యంలో జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు..

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని పల్కపల్లి గుడిబండ క్షేత్రం శివాలయంలో మంగళవారం ఆర్యవైశ్య పెద్ది వంశస్తుల వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాలుగు తరాలకు చెందిన వారు ఒకచోట చేరి సంబరాలు చేసుకున్నారు.



వనభోజనాల్లో పాల్గొన్న ప్రజలు

ప్రవాసులు సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న బొజ్జ అమరేందర్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమని.. నల్లమల ప్రాంతంలోని ప్రవాసుల కుటుంబీకులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద ఫిర్యాదులను స్వీకరించారు. ప్రభుత్వం ప్రతి మంగళ, శుక్రవారాల్లో 'ప్రజావాణి' వ్యవస్థలోనే ప్రవాసుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి

కోడేరు: మండల కేంద్రం నుంచి కొండ్రావుపల్లి గ్రామం మీదుగా బస్‌ను నడిపాలని కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్ గౌడ్‌కు సీపీఎం, డీవైఎఫ్‌ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బస్ నిలిపి వేయడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రోహిత్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన ఉండాలి

బల్మూర్: పంటల విక్రయాలు, యాసంగిలో సాగు చేసే పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తుమ్మెన్‌పేట రైతు వేదిక భవనంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగాగా వరి, పత్తి కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేష్, ఏఈఓలు ప్రశాంత్, మౌనిక, పవన్, చందన, శిరీష, ప్రవీణ్, శివకృష్ణ ,రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతిపత్రం

చారకొండ: రాష్ట్రంలో నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై చారకొండ మండల ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ సునీతకు వివిధ డిమాండ్లతో ప్రభుత్వానికి నివేదించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదలకు ఉచిత వైద్యం, విద్యా, ఇంటి నిర్మాణం, ఉపాధి కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నాగర్జున, మల్లేష్, పరుశరాములు, అయోధ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై విచారణ జరపాలి



కల్వకుర్తి రూరల్: మండలంలోని కుర్మిద్ద గ్రామంలో సర్వే నంబర్ 102, 104లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని వెంచర్‌పై సమగ్ర విచారణ జరపాలని కుర్మిద్ద గ్రామస్తులు మంగళవారం డివిజనల్ పంచాయితీ అధికారి, మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించకుండా వెంచర్ ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, హరీష్, బాలరాజు, సాయిలు, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలు మారడం లేదు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న విద్యార్థుల జీవితాలు మాత్రం మారడం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యార క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లా అని ప్రశ్నించారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ. 7,650 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, నరేష్, నితిన్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో నర్సరీలను ఏపీఓ చంద్ర సిద్దార్థ మంగళవారం పరిశీలించారు. మండలంలోని గుంతకోడూరు, యాదిరెడ్డి, మేడిపూర్ గ్రామాల్లో సందర్శించి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చవద్దు

పెద్దకొత్తపల్లి: పంట పొలాల వద్ద వరి కొయ్యలు తగులబెట్టవద్దని వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. పెద్దకార్పాములలో నిర్వహించిన రైతు వేదికలో ఆమె మాట్లాడారు. వరి కొయ్యలు కాల్చడంతో నేలలో ఉండే సేంద్రియ కర్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు. పంట అవశేషాలు కలియ దున్ని సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేయడం ద్వార సేంద్రీయ ఎరువుతో నేల సారవంతమవుతుందని పేర్కొన్నారు.

వెల్దండ: రైతులు పంట పొలాల్లోని అవశేషాలను కాల్చవద్దని మండల ఏఈఓ సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతులకు ఏఈఓలు అవగాహన కల్పించారు. వరి కొయ్యలు 20 నుంచి 30రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.